అన్నదాత చూపు.. ఆకాశం వైపు

పటాన్‌చెరు పరిధిలో పత్తి విత్తనాలు వేసేందుకు సిద్ధం చేసిన వ్యవసాయ భూమి

- మొలకెత్తని పత్తి విత్తనం
- ఎకరానికి రూ. 15 వేలు ఖర్చు
- వర్షాభావ పరిస్థితులు పత్తి రైతులకు శాపంగా మారాయి..
- ముందు మురిపించి ముఖం చాటేసిన వర్షం
- ఆందోళనలో విత్తనాలు వేసిన రైతులు

పటాన్‌చెరు, జూన్ 8 : రుతుపవనాలు ముందుస్తుగా రావడంతో అన్నదాతలు దుక్కులు సిద్ధం చేసి విత్తనాలు విత్తారు. తొలకరి వానలు భారీగా కురవడంతో రైతులు పత్తి విత్తనాలు వేశారు. వర్షాలు పడడంతో వాతావరణం చల్లబడింది. వానకాలం ప్రారంభమైందని విత్తనాలు వేసేందుకు భూములు సిద్ధం చేశారు. వారం రోజులుగా వర్షాలు పడకపోవడంతో అన్నదాతలు ఆందోళన చెందుతున్నారు. రూ. వేలు ఖర్చు చేసి పత్తి విత్తనాలు విత్తినా మొలకలు రాకపోవడంతో రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. రుతుపవనాలు మందగమనంతో ఉష్ణోగ్రతలు పెరిగిపోతున్నాయి. వేడిపెరిగిపోవడంతో ప్రజలు ఉక్కపోతతో అల్లాడిపోతున్నారు. రోహిణిలో రోళ్లు పగిలే ఎండలు ఉం టాయని గతంలో చెప్పే వారు. రోహిణిలో రోళ్లు పగిలే ఎండలు ఉండడంతో ప్రజలు ఆందోళన వ్యక్తం చేశారు. రైతులు పోటీ పడి మార్కెట్‌లో విత్తనాలు కొనుగోలు చేసి విత్తనాలు వేశారు. ఎకరం భూమిలో విత్తనాలు వేసేందుకు రూ.15 వేల వరకు ఖర్చు చేశారు. వర్షాభావ పరిస్థితులు నెలకోవడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు.

మొలకెత్తని పత్తి విత్తనం..

వర్షాభావ పరిస్థితులతో పత్తి విత్తనం మొలకెత్తక పోవడంతో రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. పటాన్‌చెరు వ్యవసాయ శాఖ డివిజన్‌లో రైతులు మే చివరిలో పత్తి, కంది, సోయా విత్తనాలు వేశారు. వారం రోజులుగా వర్షాలు పడకపోవడంతో రైతులు వేసిన విత్తనాలు భూమిలో మక్కిపోతున్నాయి. వర్షాభావ పరిస్థితులు రైతులకు శాపంగా మారింది. రైతులు తొలకరి వర్షలకు పత్తి, కంది, సోయా విత్తనాలు వేశారు. రైతులు ఎకరానికి రూ. 15 వేల వరకు ఖర్చు చేశారు. వాణిజ్య పంటలకు మార్కెట్‌లో మంచి డిమాండ్ ఉండడంతో రైతులు ఎక్కువగా పత్తి విత్తనాలు వేశారు. పత్తి విత్తనాలతో పాటు డీఏపీ, ఇతన ఎరువులో భూమిలో వేశారు. భూమిలో వేడి పెరిగిపోవడంతో విత్తనాలకు నష్టం కలుగుతున్నది. వాతావరణం చల్లబడిపోవడంతో రైతులు పోటి పడి విత్తనాలు వేశారు. మార్కెట్‌లో నాణ్యమైన విత్తనాలు లభించకపోయిన ప్రైవేట్ వ్యాపారుల నుంచి కొనుగోలు చేశారు. వారం రోజులుగా మేఘాలు దోబూచులాడుతున్నాయి. దీంతో భూమిలో వేసిన విత్తనం దెబ్బతినే పరిస్థితి ఏర్పడింది. వర్షాకాలం సాగు మృగశిర కార్తెరాకతో వాతావరణంలో చల్లబడుతుంది. వారం రోజులుగా ఎండలు దంచికొడుతున్నాయి. రైతులకు పంట దిగుబడులు ఎక్కువ రావాలంటే వాతారణం అనుకూలించాలి. కోటి ఆశలతో విత్తనాలు వేసిన రైతులకు నష్టలు తప్పుడం లేదు.

తగ్గుతున్న చిరుధాన్యాల సాగు..

వర్షాధారంగా సాగు చేసే చిరుధాన్యాల పంటల సాగు ఈ ఏడాది భారీగా తగ్గిపోతుంది. రైతులు మార్కెట్‌లో ధర ఉన్న పంటలే సాగు చేసేందుకు ఆసక్తి చూపుతున్నారు. పెసరా, మినుము, సజ్జలు, నువ్వులు, జొన్నలు, రాగులతో పాటు పలు రకాల పంటలు సాగు చేయడం లేదు. మార్కెట్‌లో చిరుధాన్యాల విత్తనాలు లభించకపోవడంతో రైతులు ఎక్కువగా సాగు చేసేందుకు ఆసక్తి చూపడం లేదు. వాణిజ్య పంటల సాగు భారీగా పెరిగిపోయింది. అన్నదాతలు ఎక్కువగా పత్తి, కంది, సోయా పంటలు సాగు చేసేందుకు ఆసక్తిగా ఉన్నారు. వర్షాభావ పరిస్థితులు నెలకోవడంతో రైతులు ఎవరు విత్తనాలు వేయరాదని వ్యవసాయ శాఖ అధికారులు సూచనలు చేస్తున్నారు. వర్షాలు పడే వరకు రైతులు విత్తనాలు వేయరాదని అవగాహన కల్పిస్తున్నారు. వ్యవసాయ శాఖ అధికారులు గ్రామాల్లో సమావేశాలు నిర్వహించి వర్షభావ పరిస్థితులపై వివరిస్తున్నారు.

అవయవదానంతో ప్రాణదాతలు కావాలి

నస్తీపూర్‌లో అవయవదానంపై అవగాహన కల్పిస్తున్న సిబ్బంది

హత్నూర, జూన్ 8 : అవయవదానంతో ప్రాణదాతలు కావాలని తెలంగాణ శరీర అవయవదాతల సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గురుప్రకాశ్ కోరారు. ఆదివారం హత్నూర మండలం నస్తీపూర్‌లో శరీర అవయవదానంపై గ్రామస్తులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అన్ని దానాల్లోకెల్లా అవయవదానం గొప్పదన్నారు. ప్రమాదవశాత్తు ఎవరైనా చనిపోయే ముందు అవయవదానం చేస్తే 18 మంది ప్రాణాలు నిలబెట్టొచ్చని సూచించారు. అనంతరం వృద్ధులకు పండ్లు పంపిణీచేశారు. కార్యక్రమంలో సంఘం నాయకులు మడప తిరవికుమార్, వెంకన్నబాపు, మహిళాసంఘం అధ్యక్షురాలు స్వప్న, కార్యదర్శి అక్షయ, వీవోఏ ప్రవీన్, ఫీల్డ్ అసిస్టెంట్ సాయిలు తదితరులు పాల్గొన్నారు.

ప్రైవేటుకు దీటుగా ప్రభుత్వ పాఠశాలలు

కొడకంచిలో బడిబాట ర్యాలీ నిర్వహిస్తున్న ఉపాధ్యాయులు

జిన్నారం, జూన్ 8 : ప్రైవేటు పాఠశాలలకు దీటుగా ప్రభుత్వ పాఠశాలల్లోనే నాణ్యమైన విద్య అందిస్తున్నామని, పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించాలని కాంప్లెక్స్ హెచ్‌ఎంలు కోరారు. ఈ మేరకు ఆదివారం మండలంలోని కొడకంచి, నల్తూర్ తదితర గ్రామాల్లో ప్రొఫెసర్ జయశంకర్ బడిబాట ర్యాలీ కార్యక్రమాలను నిర్వహించారు. ఉపాధ్యాయులు, అంగన్‌వాడీ టీచర్లు విద్యార్థుల ఇండ్లకు వెళ్లి తల్లిదండ్రులతో మాట్లాడారు. ప్రభుత్వ పాఠశాలల్లో నిష్ణాతులైన ఉపాధ్యాయులు ఉంటారని విద్యార్థుల భవిష్యత్‌కు ఎంతో ఉపయోగపడుతుందని సూచించారు. ప్రభుత్వం కల్పిస్తున్న అవకాశాలను గ్రామీణ ప్రాంత విద్యార్థుల తల్లిదండ్రులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. నూతన విద్యార్థులను నమోదు చేసి ప్రవేశాలు కల్పించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు మొగిలి మాల, ప్రాథమిక పాఠశాల హెచ్‌ఎం వెంకటేశం, అంగన్‌వాడీ టీచర్లు, తల్లిదండ్రులు, విద్యార్థులు పాల్గొన్నారు.

గ్రామాల్లో ముమ్మరంగా 'బడిబాట'

ప్రభుత్వ విద్యపై అవగాహన కల్పిస్తున్న ఉపాధ్యాయులు

నారాయణ ఖేడ్, జూన్ 8 : నారాయణ ఖేడ్ మండలంలో బడిబాట కార్యక్రమాన్ని ముమ్మరంగా నిర్వహిస్తూ బడీడు, బడిబయట పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించాలని, ప్రభుత్వ పాఠశాలల్లో చదువుకునే విద్యార్థులకు కలిగే ప్రయోజనాలను వివరిస్తున్నారు. ఆదివారం నారాయణఖేడ్ జడ్పీ హెచ్‌ఎస్ పాఠశాల ఉపాధ్యాయులు మండల పరిధిలోని వెంకటాపూర్, జూకల్ తండా, చందాపూర్, జూకల్, సత్యగామ, రుద్రారం గ్రామాల్లో పర్యటించి విద్యార్థులను తమ పాఠశాలలో చేర్పించాలని పిల్లల తల్లిదండ్రులకు తెలియజెప్పారు. విద్యార్థులకు ఉచితంగా పుస్తకాలు, నోటు పుస్తకాలు, దుస్తులు అందజేయడంతో పాటు కంప్యూటర్ శిక్షణ, సైన్స్‌ల్యాబ్ వంటి అధునాతన సదుపాయాలు అందుబాటులో ఉన్నాయని వివరించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు హమీద్, గురునాథ్, చంద్రశేఖర్ పాల్గొన్నారు.

పారదర్శకత కోసమే సామాజిక తనిఖీలు

బొక్కస్‌గాం గ్రామ సభలో తనిఖీ నివేదికలు వెల్లడిస్తున్న అధికారులు

సిర్గాపూర్, జూన్ 8 : పరిపాలన పారదర్శకత నిర్ధారించేందుకు ఒక వేదికగా పని చేయడమే సామాజిక తనిఖీల లక్ష్యమని సిర్గాపూర్ ఏపీవో బస్వరాజ్ పేర్కొన్నారు. ఆదివారం మండలంలోని సుర్త్యాతండా, జమ్లాతండా, గర్డెగాం, గైరాన్‌తండా, ఖాజాపూర్, చిన్న ముబారక్‌పూర్, బొక్కస్‌గాం, గ్రామాల్లో సోషల్ ఆడిట్‌పై గ్రామ సభలు నిర్వహించారు. ఇందులో ఆయా సంబంధిత డీఆర్పీలు గ్రామంలో చేపట్టి ఉపాధి పనుల సామాజిక తనిఖీ నివేదికలను ప్రజల సమక్షంలో వెల్లడించారు. డీఆర్పీలు, ఉపాధి కూలీలు, టీఏలు, ఎఫ్ఏలు, సిబ్బంది ఉన్నారు.

హనుమాన్ విగ్రహ ఏర్పాటుకు భూమి పూజ



విగ్రహ ఏర్పాటుకు భూమి పూజ చేస్తున్న గ్రామస్తులు

జిన్నారం, జూన్ 8 : మండల పరిధిలోని గడ్డపోతారం మున్సిపాలిటీ పరిధిలోని మాదారం గ్రామంలో 30 అడుగుల శ్రీ పంచముఖ హనుమాన్ విగ్రహ ఏర్పాటుకు శ్రీకారం చుడుతూ గ్రామస్తులతో కలిసి దాతలు భూమి పూజ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఆదివారం గ్రామంలోని రామాలయం ఎదురుగా పంచముఖ హనుమాన్ విగ్రహ నిర్మాణానికి 'అమ్మా నాన్న కన్‌స్ట్రక్షన్స్' అధినేత స్వామి రాజ్, మాజీ సర్పంచ్ సురేందర్ గౌడ్‌తో కలిసి హోమం, భూమి పూజ చేశారు. అనంతరం మాట్లాడుతూ విగ్రహాన్ని ఏర్పాటు చేయడం ద్వారా గ్రామంలో మరింత ఆధ్యాత్మిక వాతావరణం ఏర్పడుతుందన్నారు. విగ్రహాన్ని ఏర్పాటు చేస్తున్న దాతలు ఆలయ కమిటీ సభ్యులు గ్రామస్తులు అభినందిస్తూ ధన్యవాదాలు తెలిపారు. ఈ సందర్భంగా దాతలను, నాయకులను కమిటీ సభ్యులు సన్మానించారు. నియోజకవర్గ విద్యార్థి జేఏసీ అధ్యక్షుడు విజయ్ కుమా ర్ గౌడ్, నాయకులు రాజు గౌడ్, మణిక్ యా దవ్, మాజీ ప్రజా ప్రతినిధులు, ఆలయ కమి టీ సభ్యులు పాల్గొన్నారు.

మృగశిర సందడి

మృగశిర కార్తెతో వానకాలానికి స్వాగతం పలికిన రైతులు

గుమ్మడిదల: బొంతపల్లి అంగడి బజార్‌లో కొర్రమీనును విక్రయిస్తున్న దృశ్యం

గుమ్మడిదల, జూన్ 8 : రోహిణి కార్తెలో ఒక వైపు ఎండలు, మరో వైపు అకాల వానలు కురిసి రైతులకు తీవ్ర నష్టాన్ని మిగిలిచాయి. ఇకమృగశిర కార్తె ఆదివారం రావడంతో వానకాలం సీజన్ ప్రారంభమైనది. దీంతో రైతులు, ప్రజలు వానాకాలానికి స్వాగతం పలికారు. రెండు సీజన్‌ల వాతావరణాన్ని తట్టుకోవడానికి చేపలు, చికన్‌ను వేడి పదార్థాలు తినడం వల్ల శరీరానికి వాతావణం తట్టుకోవడానికి సమన్వయం చేస్తాయని నమ్మకం ఉంది. దీంతో గుమ్మడిదల మండలంతో పాటు అన్ని గ్రామాల్లో చెరువులో చేపలను వేటాడి విక్రయిస్తున్నారు. కొరమీనులు కిలోకు రూ. 800, తెల్ల చేపలు కిలో కు. రూ. 200 విక్రయించారు. జనం అధికంగా చేపలను కొనుగోలు చేశారు. దీంతో మృగశిర సందడి నెలకొన్నది. ప్రతిమార్కెట్లో, అంగట్లో చేపల విక్రయాల వద్ద జనం కొనుగోలు భారీగా చేశారు.

జిన్నారంలో..

జిన్నారం, జూన్ 8 : మృగశిర కార్తెను జిన్నారం మండలంలో ఆదివారం ఘనంగా జరుపుకొన్నారు. మండలంలోని కొడకంచి, ఊట్ల, గడ్డపోతారం, శివానగర్, రాళ్లకత్వ, వావిలాల, జిన్నారం గ్రామాల్లోని మత్స్యకారులు చెరువుల వద్ద జోరుగా చేపల విక్రయాలు చేశారు.

ఆలయాలు ప్రశాంతతకు నిలయాలు

పూజలు చేస్తున్న బీఆర్ఎస్ రాష్ట్రనాయకుడు గోవర్ధన్‌రెడ్డి

గుమ్మడిదల, జూన్ 8: దేవాలయాలు మానసిక ప్రశాంతతకు నిలయాలని బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు చిమ్ముల గోవర్ధన్‌రెడ్డి అన్నారు. ఆదివారం మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా దుండిగల్ మున్సిపాలిటీ పరిధిలోని చర్చిగాగిల్లాపూర్‌లో నూతనంగా నిర్మించిన గంగాపార్వతీ సమేత ఉమామహేశ్వరస్వామి దేవాలయంలో విగ్రహ, ధ్వజస్తంభం ప్రతిష్ఠ మహోత్సవంలో పాల్గొన్నారు. అనంతరం స్వామివారిని దర్శించుకున్నారు. దేవాలయ నిర్వహకులు బీఆర్ఎస్ నాయకులను సన్మానించారు. కౌన్సిలర్ జోస్మిన్, సుధాకర్‌రెడ్డి, శంకర్‌చౌహాన్, అరుణ, నాగరాజు, మద్దివీరారెడ్డి, వాసుదేవారెడ్డి, సూర్యనారాయణ, చంద్రారెడ్డి, నరేశ్ తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే మాగంటి మృతి బీఆర్ఎస్‌కు తీరని లోటు

గుమ్మడిదల, జూన్ 8 : జ్యూబ్లీహిల్స్ ఎమ్మె ల్యే మాగంటిగోపినాథ్ మృతి బీఆర్ఎస్ పార్టీకి తీరని లోటని రాష్ట్ర నాయకుడు గోవర్ధన్‌రెడ్డి, గుమ్మడిదల మండలాధ్యక్షుడు కొత్తపల్లి ప్రభాకర్‌రెడ్డి ఆవేదన వ్యక్తం చేశారు. ఆదివారం గుమ్మడిదల పార్టీ కార్యాలయంలో వారు మాట్లాడారు. ప్రజాసేవకుడిని కోల్పోవడం దురదృష్టకరమన్నారు. ఆయన ఆత్మకుశాంతి చేకురాలని కోరారు.

మురుగన్ కలెక్షన్ ప్రారంభం

అమీన్‌పూర్ మున్సిపల్ పరిధిలోని ఇక్రిశాట్ కాలనీ ఫేస్ 2 లో నూతనంగా ఏర్పాటు చేసిన మురుగన్ కలెక్షన్స్‌ను ఆదివారం మెదక్ మాజీ ఎమ్మెల్యే పద్మా దేవేందర్ రెడ్డి ప్రారంభించారు. ఈ ప్రారంభోత్సవంలో ఎమ్మెల్యే మహిపాల్‌రెడ్డి, మెదక్ మున్సిపల్ మాజీ చైర్మన్ మల్లికార్జున్ గౌడ్ ,అమీన్‌పూర్ మున్సిపల్ మాజీ వైస్ చైర్మన్ నందారం నరసింహా గౌడ్, మాజీ ఎంపీపీ ఈర్ల దేవానంద్, కౌన్సిలర్లు పాల్గొన్నారు.

-అమీన్‌పూర్ జూన్ 8

నాలుగు లేబర్ కోడ్‌లను రద్దు చేయాలి

సీఐటీయూ రాష్ట్ర అధ్యక్షుడు చుక్క రాములు

మాట్లాడుతున్న అధ్యక్షుడు చుక్క రాములు

జిన్నారం, జూన్ 8 : కార్మికుల శ్రమను దోపిడీ చేసేందుకే కేంద్రం నాలుగు లేబర్ కోడులను అమలు చేయాలని చూస్తోందని, వాటికి వ్యతిరేకంగా పోరాటం చేయవలసిన అవసరం ఉందని సీఐటీయూ రాష్ట్ర అధ్యక్షుడు చుక్క రాములు పిలుపునిచ్చారు. ఆదివారం కాజీపల్లి పారిశ్రామిక వాడలోని టీఐడీసీ పరిశ్రమ కార్మికుల సమావేశంలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని ప్రసంగించారు. ఈ లేబర్ కోడులు అమల్లోకి వస్తే 95 శాతం మంది కార్మిక వర్గం వెట్టి చాకిరిలోకి నెట్టబడతారని ఆవేదన వ్యక్తం చేశారు. జిల్లా కార్మిక నాయకులు మల్లేశ్, రాజయ్య, భాస్కర్ రెడ్డి, వెంకటేశ్వర్లు, చంద్రశేఖర్, ప్రభాకర్, శ్రీరాములు, సత్తయ్య, సుధాకర్ గౌడ్, శ్రీకాంత్ పాల్గొన్నారు.

బీఆర్ఎస్‌లో పలువురు చేరిక



బీఆర్ఎస్‌లో చేరిన వీరారెడ్డిపల్లి కాంగ్రెస్ కార్యకర్త కనకరాజు

గుమ్మడిదల, జూన్8 : కాంగ్రెస్‌పార్టీ (ఎన్ఎంఆర్‌యువసేన) నుంచి బీఆర్ఎస్‌లోకి చేరారు. గుమ్మడిదల మండలంలోని వీరారెడ్డిపల్లి గ్రామానికి చెందిన కాంగ్రెస్ కార్యకర్త కనకరాజు ఆదివారం బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు చిమ్ముల గోవర్ధన్‌రెడ్డి సమక్షంలో పార్టీలో చేరారు. వీరికి పార్టీ కండువా వేసి స్వాగతం పలికారు. అనంతరం కనకరాజు మాట్లాడుతూ ప్రజల కోసం సేవ చేసేందుకు బీఆర్ఎస్ సరైన వేదిక అన్నారు. నేతలు దేవేందర్‌రెడ్డి, సూర్యనారాయణ, జింకగోపాల్, చంద్రారెడ్డి, శ్రీకాంత్, సురభి వినోద్‌గౌడ్ తదితరులు ఉన్నారు.

బీఆర్ఎస్ మాత్రమే సెక్యులర్ పార్టీ

కోహీర్‌లో మాట్లాడుతున్న బీఆర్ఎస్ నాయకులు

కోహీర్, జూన్ 8 : కేసీఆర్ నేతృత్వంలోని బీఆర్ఎస్ మాత్రమే సెక్యులర్ పార్టీ అని బీఆర్ఎస్ యువజన విభాగం నాయకులు పేర్కొన్నారు. ఆదివారం కోహీర్ పట్టణంలోని బీఆర్ఎస్ కార్యాలయంలో స్థానిక విలేకరులతో వారు మాట్లాడారు. కేసీఆర్ హయాంలో ముస్లిం నేతలకు అనేక పదవులను ఇచ్చి గౌరవించారని గుర్తు చేశారు. కాంగ్రెస్ మాత్రం ఒక్క ముస్లిం నేతకు పదవి ఇవ్వలేదని విమర్శించారు. సెక్యులర్ పార్టీ అని చెప్పుకునే కాంగ్రెస్ తన పనితీరు అందుకు విరుద్ధంగా ఉందన్నారు. ముస్లింలకు ప్రాధాన్యత ఇవ్వని కాంగ్రెస్‌లో ఒక్క ముస్లిం కూడా ఉం డొద్దని సూచించారు. నిజమైన సెక్యులర్ పార్టీ అయిన బీఆర్ఎస్‌లోకి రావాలని కోరారు. సమావేశంలో సందీప్, దినకర్, అస్లాం, వాజీద్, తదితరులు ఉన్నారు.

గుర్తు తెలియని మహిళ మృతదేహం లభ్యం

సంగారెడ్డి, జూన్ 8 : జిల్లా కేంద్రంలోని మహబూబ్‌సాగర్ చెరువులో గుర్తు తెలియని మహిళ మృతదేహం లభించిందని ఇన్‌స్పెక్టర్ రమేశ్ తెలిపారు. మహిళ చెరువులోకి బట్టలు ఉతకడానికి (లేదా) కాలకృత్యాలకు వెళ్లి ప్రమాదవశాత్తు నీటిలో జారిపడి మృతిచెందినట్లు తెలిపారు. వయస్సు 25 నుంచి 30 ఏండ్ల వరకు ఉంటుందని ఎవరైనా మృతదేహన్ని గుర్తిస్తే పట్టణ పోలీస్‌స్టేషన్‌లో సమాచారం ఇవ్వాలని ఇన్‌స్పెక్టర్ సూచించారు.

చిల్డ్రన్ పార్కు ప్రారంభించేదెప్పుడో..?

సదాశివపేటలో చిల్డ్రన్ పార్కుకు తాళం వేసిన దృశ్యం

చిల్డ్రన్ పార్కులో ఏర్పాటు చేసిన వివిధ ఆకృతులు

సదాశివపేట, జూన్ 8 : చిన్నలు, పెద్దలు సేద తీరేందుకు సదాశివపేట పట్టణంలో నిర్మించిన చిల్డ్రన్ పార్కుకు తాళం పడింది. నిర్మాణం పూర్తయి రెండేండ్లయినా పార్కుకు తాళం తీయడం లేదు. వేసవి కాలం ముగుస్తున్నా పార్కును ప్రారంభించక పోవడంపై పట్టణ వాసులు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. పార్కును ఎప్పుడు ప్రారంభిస్తారో అని ఎదురు చూస్తున్నారు. నిత్యం బిజీగా ఉండే పేట ప్రజలు సేదతీరిందుకు బీఆర్ఎస్ ప్రభుత్వం రూ. 1.50 కోట్లతో చిల్డ్రన్ పార్కును ఏర్పాటు చేసింది. అందరూ ఆహ్లాదం పొందేందుకు చూడచక్కని రీతిలో పార్కు రూపుదిద్దుకున్నది. కానీ, అధికారుల తీరుతో ప్రారంభానికి నోచుకోవడంలేదని పలువురు విమర్శిస్తున్నారు. పట్టణంలోని 10వ వార్డులో దీనిని ఏర్పాటు చేశారు. పార్కులో ఏర్పాటు చేసిన వివిధ ఆకృతులు అందరినీ ఆకట్టుకుంటున్నాయి. వాకింగ్ ట్రాక్, పిల్లలు ఆడుకునేందుకు అధునాతన ఆట వస్తువులు ఏర్పాటు చేశారు. పండ్లు, ఫలాలు, జంతువులు, కూరగాయలు తదితర ఆకృతులను అందరినీ ఆకట్టుకుంటున్నాయి. పట్టణంతో పాటు మండల పరిధిలోని ఆయా గ్రామాల ప్రజలు పార్కులో సేద తీరేందుకు ఏర్పాట్లు చేశారు. వివిధ ఆకృతుల్లో బల్లలను ఏర్పాటు చేశారు. హైదరాబాద్‌లోని పార్కులను తలపించేలా చిల్డ్రన్ పార్కు సుందరీకరణ పనులు జరిగాయి. రాబోయే రోజులలో చిల్డ్రన్ పార్కు పిక్నిక్ స్పాట్‌గా మారే అవకాశం ఉంది. కానీ, అధికారుల నిర్లక్ష్యంతో ఇంకా అందుబాటులోకి రావడం లేదు. ఇప్పటికైనా అధికారులు స్పందించి చిల్డ్రన్ పార్కును అందుబాటులోకి తీసుకురావాలని పట్టణ ప్రజలు కోరుతున్నారు.

ఆర్టీసీ విశ్రాంతి ఉద్యోగుల నూతన కమిటీ ఎన్నిక

సంగారెడ్డి, జూన్ 8 : టీజీఎస్‌ఆర్టీసీలో విధులు నిర్వహించి విశ్రాంతి పొందిన ఉద్యోగులు డిపో నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. ఆదివారం పట్టణంలోని కొత్త బస్టాండ్ ఆవరణలో సమావేశమై కమిటీని ఏకగ్రీవంగా ఎంపిక చేశారు. ఈ కమిటీ విశ్రాంతి ఉద్యోగుల రాష్ట్ర కార్యదర్శి మురళీధర్, రీజినల్ కార్యదర్శి మూర్తి ఆధ్వర్యంలో ఎన్నుకున్నారు. డిపో అధ్యక్షుడిగా ఎండీ జానీమియా, ఉపాధ్యక్షులు రాంరెడ్డి, నర్సింహులు, కార్యదర్శి నాగేశ్వర్(ఏడీసీ), ఉప కార్యదర్శి వీఎల్ రెడ్డి, ప్రసాద్, సంయుక్త కార్యదర్శిగా రాములు, ప్రచార కార్యదర్శిగా జనార్దన్, కోశాధికారిగా బాలరాజ్, సలహాదారుగా సత్తయ్య, మురళి, సభ్యులను ఎన్నుకున్నారు.

124వ రోజుకు చేరిన రిలే నిరాహార దీక్ష



నిరాహారదీక్షలు చేస్తున్న రైతు, మహిళా జేఏసీ సభ్యులు

గుమ్మడిదల, జూన్ 8 : మృగశిర కార్తె ప్రారంభం రోజు రైతులందరూ సంతోషంగా పొలం పనుల్లో నిమగ్నమవుతారు. మృగశిర కార్తె రోజు చేపలు, మంచి వంటకాలు చేసుకొని సంతోషంగా గడుపుతారు. కానీ నల్లవల్లి, ప్యారానగర్, కొత్తపల్లి గ్రామాల రైతులకు ఆ సంతోషం లేదు. మృగశిరకార్తె రోజు కూడా ఆసంతోషాన్ని పక్కన పెట్టి 124వ రోజు రిలే నిరాహారదీక్షలు చేస్తున్నామని రైతు జేఏసీ నాయకులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. డంపింగ్‌యార్డును వ్యతిరేకిస్తూ దీక్షలు చేసున్నా రాష్ట్ర ప్రభుత్వం స్పందించక పోవడంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. డంపింగ్‌యార్డుకు ఇచ్చిన అనుమతులు ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు.

మాజీ ఎమ్మెల్యే పరామర్శ

పరామర్శిస్తున్న మాజీ ఎమ్మెల్యే భూపాల్‌రెడ్డి

నారాయణఖేడ్, జూన్ 8: నారాయణఖేడ్ మండలం జుజాల్‌పూర్‌కు చెందిన జగతి సతీశ్ రోడ్డు ప్రమాదంలో గాయపడి సంగారెడ్డిలోని ఓ ప్రైవేట్ దవాఖానలో చికిత్స పొందుతున్నాడు. విషయం తెలుసుకున్న మాజీ ఎమ్మెల్యే మహారెడ్డి భూపాల్‌రెడ్డి ఆదివారం దవాఖానకు వెళ్లి పరామర్శించారు. ఆయన వెంట స్థానికల నేతలు ఉన్నారు.

రోడ్డు ప్రమాదంలో వృద్ధురాలికి గాయాలు

కోహీర్, జూన్ 8 : మండలంలోని కొత్తూర్(డి) గ్రామ 65వ జాతీయ రహదారిపై ఆదివారం మధ్యాహ్నం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ వృద్ధురాలికి తీవ్రగాయాలయ్యాయి. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. కొత్తూర్(డి) గ్రామానికి చెందిన గొల్ల మాణమ్మ పశువుల మేత కోసం గ్రామ శివారుకు వెళ్లింది. రోడ్డు దాటుతుండగా సదాశివపేట వైపు నుంచి జహీరాబాద్ వైపునకు అతి వేగంగా వెళ్తున్న కారు ఆమెను ఢీకొన్నది. ప్రమాదంలో మాణమ్మకు చెయ్యి, కాలు విరిగింది. చికిత్స కోసం జహీరాబాద్ దవాఖానకు తరలించారు. పోలీసులు సంఘటన స్థలాన్ని సందర్శించి వివరాలను సేకరించారు.

లోక్ అదాలత్‌ను సద్వినియోగించుకోవాలి

సిర్గాపూర్, జూన్ 8 : నారాయణఖేడ్‌లోని జూనియర్ సివిల్ కోర్టులో జూన్ 14న నిర్వహించే లోక్ అదాలత్‌ను కక్షిదారులు సద్వినియోగం చేసుకోవాలని సిర్గాపూర్ ఎస్సై వెంకట్‌రెడ్డి ఆదివారం తెలిపారు. చాలా రోజుల నుంచి పెండింగ్‌లో ఉన్న కేసులు ఉన్నట్లయితే వాటిని రాజీ చేసుకోవాలని సూచించారు. ఈనెల 9 నుంచి 14వ తేదీలోపు స్థానిక ఠాణాకు, కోర్టుకు గానీ ఇరువర్గాల కక్షిదారులు హాజరైతే వారిని కోర్టులో ప్రవేశ పెట్టి ఆకేసును పూర్తిగా క్లోజ్ చేయనున్నట్లు పేర్కొన్నారు.

నేడు పోచాపూర్, ఖాజాపూర్‌లో రెవెన్యూ సదస్సులు

సిర్గాపూర్, జూన్ 8 : మండలంలోని పోచాపూర్, ఖాజాపూర్ గ్రామాల్లో జూన్ 9న సోమవారం రెవెన్యూ సదస్సులు నిర్వహిస్తున్నామని ఉప తహసీల్దార్ హేమంత్ కుమార్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. గ్రామాల్లో నెలకొన్న పెండింగ్ రెవెన్యూ సమస్యలను పరిష్కరించుకునేందుకు ఈ సదస్సులును ఎంతో దోహదపడతాయని ఆయన సూచించారు.

విద్యుత్‌షాక్‌తో ఎద్దు మృతి

హత్నూర, జూన్ 8 : విద్యుత్‌షాక్‌తో ఎద్దు మృతిచెందిన సంఘటన హత్నూర గ్రామ శివారులో ఆదివారం చోటు చేసుకుంది. గ్రామానికి చెందిన మంగలి నర్సింహులు మేత కోసం తీసుకెళ్లగా, విద్యుత్ ట్రాన్స్ ఫార్మర్ వద్ద కిందకువేలాడుతున్న విద్యుత్ తీగలు తగిలి మృతిచెందినట్లు బాధితుడు వాపోయాడు. వారం రోజుల క్రితమే రూ.1.50 లక్షలు వెచ్చించి రెండు ఎడ్లు కొనుగోలు చేయగా, అందులో ఒకటి మృతి చెందడంతో బోరున విలపించాడు. విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ వద్ద ఎలాంటి భద్రత చర్యలు తీసుకోకపోగా, విద్యుత్ తీగలు వేలాడుతున్నా అధికారులు పట్టించుకోలేదని స్థానిక రైతులు వాపోయారు. అధికారుల నిర్లక్ష్యంతోనే ఎద్దు మృతిచెందినట్లు ఆరోపించారు. ప్రభుత్వం బాధిత కుటుంబీకులను ఆదుకోవాలని కోరారు.

ఆత్మహత్యాయత్నానికి యత్నించిన యువకుడిని కాపాడిన పోలీసులు

సంగారెడ్డి, జూన్ 8 : కుటుంబ కలహాలతో మనస్తాపం చెందిన వ్యక్తి ఆత్మహత్య చేసుకొని చనిపోతున్నానని డయల్ 100కు సమాచారం ఇచ్చి ఆత్మహత్యకు యత్నించాడు. వెంటనే అప్రమత్తమైన రూరల్ పోలీస్‌స్టేషన్ బ్లూకోల్ట్స్ పోలీసులు హుటాహుటినా సంఘటనా స్థలం ఫసల్‌వాది శివారులోని డబుల్‌బెడ్ రూమ్‌లో నివాసం ఉండే యూనిస్‌గా గుర్తించి కాపాడారు. అనంతరం యూనిస్‌కు కౌన్సెలింగ్ ఇచ్చి అతడి బాబాయ్ మౌలాలికి అప్పగించారు. ఎవరైనా అత్యవసర సమయంలో బ్లూకోల్ట్స్ పోలీసులకు సమాచారం ఇస్తే వెంటనే స్పందించి సేవలు అందిస్తామని పోలీసులు తెలిపారు.